# బాల వికాస సేవలు అభినందనీయం

## పశువులకు ప్రత్యేక టీకాల కార్యక్రమం

**24 నుంచి జూలై 8 వరకు మండల పశువైద్యాధికారి డాక్టర్ మనోహర్ కృష్ణ కుమార్**



తొలి సమయం మరిపెడ జూన్ 23

వర్షాకాలం ప్రారంభ నేపథ్యంలో పశువులను అంటు వ్యాధుల నుంచి రక్షించేందుకు ఈ నెల 24 నుంచి జూలై 8 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని నిర్వహిం చనున్నట్లు మరిపెడ మండల పశు వైద్యాధికారి డాక్టర్ మనోహర్ కృష్ణ కుమార్ తెలిపారు. మం గళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, పశు సంవర్ధక శాఖ ఆదేశాల మేరకు ఆవులు, ఎద్దులు, గేదెలకు గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎండీ) నిరోధక టీకాలతో పాటు ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిసీజ్) నిరోధక టీకాలను ఉచితంగా వేయనున్నట్లు వెల్లడించారు. వర్షాకాలంలో పశు వులకు వివిధ రకాల అంటువ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అందువల్ల రైతులు తమ పశు వులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. మరికొన్ని పశువులు వివిధ రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. కావున మండలంలోని రైతులు, పశు పోషకులు, గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ సీజన్లో అప్రమత్తంగా ఉండి వ్యాధులకు గురికాకుండా తమ పశుసంపదను రక్షించుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

## విద్యుఘాతంతో దుక్కిటెద్దు మృతి



తొలి సమయం మరిపెడ జూన్ 23

విద్యుఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మరిపెడ మండలంవెంకట్యా తండా శివారులో మంగళవారం చోటు చేసుకుంది.బాధిత రైతు బానోత్ హచ్చు అనే రైతు తెలిపిన వివరాల ప్రకారం..మరిపెడ మండలం వెంకట్యా తండాకు చెందిన బానోత్ హచ్చు అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు ఉదయం మేతకు తండా శివారులోకి వెళ్లింది.ఇటీవల వీచిన ఈదురుగాలులకు 11 కేవి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి.అక్కడ గడ్డి మేస్తున్న క్రమంలో ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగలకు ప్రమాదవశాత్తు తగిలింది.దీంతో విద్యుత్ షాక్ గురై దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతి చెందింది.హచ్చు రైతు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు.సుమారు 75 వేల విలువ గల దుక్కిటెద్దు మృతి చెందడంతో తాను జీవనోపాధి కోల్పోయానని రైతు హచ్చు బోరున విలపించారు.వ్యవసాయంపై బ్రతుకుతున్న తనకు ప్రభుత్వమే ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు.సంఘటన స్థలానికి పశువైద్యాధికారి డాక్టర్ మనోహర్ కృష్ణ కుమార్ చేరుకొని పంచనామా నిర్వహించారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఘన నివాళి



తొలి సమయం కొత్తగూడ 23. జూన్ 2026

తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, తెలంగాణ జాతిపితగా పేరుగాంచిన ప్రొఫెసర్ కె. జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా స్థానిక కొత్తగూడ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా టీయూఎఫ్ మండల అధ్యక్షుడు బోనాల ప్రవీణ్ చారి, ప్రధాన కార్యదర్శి వజ్జ రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంత బలం, మార్గదర్శకత్వం ఉద్యమ విజయానికి ప్రధాన కారణమని కొనియాడారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో జయశంకర్ సార్ కలలు కొంతవరకు సాకారమైనప్పటికీ, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి తెలంగాణ బిడ్డ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాన అభివృద్ధి, సామాజిక న్యాయం, తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఆయన చూపిన మార్గంలో నడవాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు పొడిశెట్టి సురేష్, వీరస్వామి, రాహుల్, ఉపేందర్ తదితరులు పాల్గొని జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ తెలంగాణ ఉద్యమంలో చేసిన త్యాగాలను కొనియాడారు.

## పారామెడికల్ బోర్డును అగ్రస్థానంలో నిలిపిన బోడా ప్రేమ్‌కుమార్‌కు అభినందనలు

**ఎన్‌హెచ్ఎం డైరెక్టర్‌గా పదోన్నతి, నూతన కార్యదర్శిగా బానోతు మంజునాథ్ బాధ్యతలు**



తొలి సమయం జూన్ 23 తొర్రూరు

తెలంగాణ పారామెడికల్ బోర్డు కార్యదర్శిగా ఐదేళ్లు సేవలందించి బోర్డును దేశంలోనే అగ్రస్థా నంలో నిలిపిన బోడా ప్రేమ్‌కుమార్ నాయక్ ఎన్‌హెచ్ఎం రాష్ట్ర డైరెక్టర్‌గా పదోన్నతి పొందారనీ ప్రైవేట్ కాలేజీల అసోసియేషన్ పేర్కొంది. ఆయనకు అభినందనలు తెలిపారు. అదే విధంగా నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బానోతు మంజునాథ్ నాయక్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో పారామెడికల్ విద్యారంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం లోని భార్గవి పారామెడికల్ కాలేజీ కరస్పాండెంట్ జ్యోతి సాయి కృష్ణ పాల్గొని మాజీ, నూతన కార్యదర్శులను సన్మానించారు.

**వితంతులను చిన్నచూపు చూడకూడదు**

**మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి**

**బాల వికాస ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ వితంతు దినోత్సవం**




తొలి సమయం మరిపెడ జూన్ 23

బాల వికాస సేవలు అభినందనీయమని, సమాజంలో వితంతు లను చిన్నచూపు చూడకుండా వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించి, సమాన హక్కులు అందించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అన్నారు.అంతర్జాతీయ వితంతు దినోత్సవం సందర్భంగా బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో మరిపెడ మండల కేంద్రంలోని బాల వికాస కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ వితంతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి,వైస్ చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజర య్యారు.ఈ సందర్భంగా ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ భర్తను కోల్పోయిన మహిళలను సమాజం చిన్నచూపు చూడడం బాధాకరమని అన్నారు.వితంతులు కూడా సమాజంలో ఇతర మహిళల మాదిరిగానే గౌరవం,గుర్తింపు,అవకాశాలు పొందే హక్కు కలిగి ఉన్నారని తెలిపారు.వారి పట్ల వివక్ష చూపకుండా అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచిం చారు.ఆడపిల్లలకు చిన్ననాటి నుంచే తల్లిదండ్రులు పూలు, బొట్టు,గాజులు అలంకరిస్తారని,అయితే భర్త మరణించిన తర్వాత వాటిని తీసివేయడం సరైనవి కాదని ఆమె అభిప్రాయ పడ్డారు.మహిళ వ్యక్తిత్వాన్ని,ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇటువంటి ఆచారాలను సమాజం పునరాలోచించాల్సిన అవసరం ఉం దన్నారు.స్త్రీ అంటే శక్తి స్వరూపమని,కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలోనూ మహిళల పాత్ర ఎంతో కీలకమని ప్రగతి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు.ప్రతి మహిళను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు.వితంతుల సమస్యలపై అవగాహన కల్పిస్తూ,వారి హక్కుల పరిరక్షణ కోసం బాల వికాస సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమ న్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి,సమాజంలో సమాన స్థానం కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహ దపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాల వికాస సెంటర్ కోఆర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర, సహా కోఆర్డినేటర్లు జజ్జూరి ఉపేంద్ర, గుగులోత్ కవిత, గ్రూప్ లీడర్లు శాంతమ్మ, ఉషా, సమ్మక్క, చాందిని, వివిధ గ్రూపుల సభ్యులు, మహిళలు ఇతరులు పాల్గొన్నారు.

## వనపర్తి పట్టణంలోని ప్రతిపక్ష పార్టీ నాయకులకు విజ్ఞప్తి

తొలి సమయం, వనపర్తి జూన్ 23

వనపర్తి లో కూడా హైడ్రా తరహాలో సామాన్యుల డబ్బాలను తొలిగించి, అధికార పార్టీ లో ఉన్న వారి అక్రమ కట్టడాలను మాత్రం తొలగించక పోవడం హైడ్రా ను తలపిస్తుంది.వనపర్తి పట్టణం చిట్యాల రోడ్డులో ప్రభుత్వం లో డబుల్ బెడ్ఃరూం ఇల్లు నిర్మించి ఇచ్చిన విషయం తెలిసిందే... అక్కడ ప్రజల సౌకర్యార్థం నిత్యావసర వస్తువులు కావాలంటే ప్రతి చిన్న దానికి టౌన్ లోకి వెళ్లి రావాలంటే ఇబ్బందులు అవుతాయని అక్కడ కొంతమంది కాలనీ వాసులు చిన్న చిన్న డబ్బాలు వేసుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. కానీ రాష్ట్రం లో ఎక్కడ కూడా లేని విధంగా చిట్యాల డబల్ బెడ్ రూమ్ కాలనీలో కొంతమంది కమిటీల పేరుతో అక్రమ కట్టడాలు తొలిగించాలి అని కొన్ని రోజుల క్రితం మునిసిపల్ కమీషనర్ గారికి, ప్రజావాణి లో, మరియు కొంతమంది అధికార పార్టీ నాయకులతో కలిసి గౌరవ ఎమ్మెల్యే గారికి కూడా వినతి పత్రం ఇవ్వడం జరిగింది. పై వారందరు కూడా వెంటనే స్పందించి ఇక్కడ ఉన్న డబ్బాలను తొలిగిస్తాం అని జేసీబీ పెట్టి తీసేస్తాం అని చెప్పడం జరిగింది...... ఇంటిగ్రెటెడ్ మార్కెట్ యార్డ్ లో కూరగాయల సంత తరలింపు ఎందుకు ఆలస్యం అవుతుంది. ఒక వేల తరలిస్తే అక్కడ ఉన్న పెద్ద పెద్ద కిరాణం వ్యాపారుల దందా కి గండి పడుతుందని అది తరలించకుండా అందుకు ఆ వ్యాపారుల నుండి ఎవరెవరికి



ఎన్నెన్ని అమ్యామ్యాలు ముట్టాయో అని పట్టణ ప్రజలు చర్చిం చుకుంటున్నారు. అంటే ఈ కాలనీ వాసులకు నిత్యావసరాలు అవసరం లేదా? తీసివేయడానికి కాలనీ వాసులందరు ఒప్పుకున్నారా?నోటీసులు ఏమైనా ఇచ్చార కమిటీలుగా చెప్పుకునే వారు ఏమి చెప్పినా పాటిస్తారా? ఈ న్యాయం కమిటీ వాళ్లకు వర్తించదా? కేవలం పార్టీ వాళ్ళవే తీసేసి అధికార పార్టీకి కొమ్ము కాస్తున్న వారి కట్టడాలు ఎందుకు తీయలేదు ఎందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మతి లేని కారణాలు పెట్టి పేద ప్రజలపై, చిరు వ్యాపారు లపై ఇబ్బంది పెట్టి వారి పొట్టకొడుతున్నారు.. మీ రాజకీయ స్వలాభం కొరకు చాలా మంది అమాయక ప్రజల కడుపు ఎందుకు కొడుతున్నారు ?

## మహిళా సాధికారత సభకు భారీగా తరలిరండి

**తొర్రూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సోమ రజినీరాజశేఖర్**

తొలి సమయం జూన్ 23 తొర్రూరు

ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఫౌండర్ శ్రీమతి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా సాధికారత, అవగాహన, ఆత్మవిశ్వాసం మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో బుధవారము ఉదయం 10:00 గంటలకు హైద రాబాద్ జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా తొర్రూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శ్రీ సోమ రజినీరాజశేఖర్ మాట్లాడుతూ..మహిళల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, స్వయం సాధికారత, సమా జంలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మహిళలందరూ ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహిళల



అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి, ఆర్థిక స్వా వలంబన, సామాజిక చైతన్యం వంటి అనేక కీలక అంశాలపై ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిం చబడనుందని తెలి పారు. సమాజ నిర్మాణంలో మహి ళల పాత్ర అత్యంత కీలక మైందని, మహిళా శక్తి బలోపేతం అయితే కుటుం బం, సమా జం, దేశం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కాబట్టి మహిళలు, మహిళా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ సోమ రజినీరాజశేఖర్ కోరారు.

## బుసిరెడ్డిపల్లి గ్రామంలో వారంతపు సంత ప్రారంభం





తొలి సమయం, వనపర్తి జూన్ 23

వ్యాపారస్తులకు, ప్రజలకు స్వాగతంసుస్వాగతం గ్రామ ప్రజల అవసరాలకు మరింత చేరువగా రైతుల ఉత్పత్తులకు సరైన మార్కెట్ గా బుసిరెడ్డిపల్లి వారంతపు సంతకు ఘన స్వాగతంతేదీ 23/06/2026 మంగళవారంసాయంత్రం 4 గంటల నుండి ప్రారంభం స్థలం: కేతపల్లి రోడ్డు ఎస్సీ వార్డ్ గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు గ్రామ ప్రజల సమిష్టి ఆలోచన నిర్ణయంతో ప్రారంభం మన అందరి ఐక్యతే మన గ్రామం అభివృద్ధి తాజా కూరగాయలు, పండ్లు, నిత్యవసర వస్తువులు ఒకే చోట దొరుకు స్థలం రైతు వినియోగదారుల మధ్య ప్రత్యక్ష వాణిజ్యానికి వేదికసంత అభివృద్ధి -గ్రామ ప్రగతి రైతు బలపడితే గ్రామం బలపడుతుంది వారంతపు సంత ప్రారంభానికి సహకరించిన గ్రామ పాలకవర్గానికి, గ్రామ ప్రజానీకానికి హృదయపూర్వక ధన్యవాదములు అభినందనలతో తలకంటి ప్రభాకర్ రెడ్డి సర్పంచ్ బుసిరెడ్డిపల్లి గ్రామం.

## అనారోగ్యంతో మున్సిపల్ తాత్కాలిక కార్మికుడు మృతి

**25 వేలు ఆర్థిక సహాయం అందించిన టీఎన్ఆర్ ట్రస్ట్**




తొలిసమయం, కొత్తగూడెం, జూన్ 23 :

కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని గాజులరాజం బస్తికి చెందిన తాత్కాలిక మున్సిపల్ కార్మికుడు గూడూరి శేషుకుమార్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు న్నారు. శేషు కుమార్ కుటుంబ పరిస్థితి గురించి తెలుసుకున్న టీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ట్రస్ట్ సభ్యులు తాండ్ర నాగబాబు, నరాటి ప్రసాద్, తాండ్ర బుచ్చిబాబు, కోడుమూరి పుల్లారావు సోమవారం అతని కుటుం బాన్ని కలిసి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గాజులరాజ్యం బస్తి వాసులు కోండ్రు శేఖర్, శ్యామ్, అడప నవీన్, వరప్రసాద్, మహేష్, సతీష్, గోపీ, అజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.